ఇంటర్నల్ పరీక్షలకు అనుమతించలేదని

ఎస్‌పీటీయూ విద్యార్థుల నిరసన

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఇంటర్నల్ ఎగ్జామ్స్ రాసేందుకు వెళ్లిన విద్యార్థులకు చుక్కెదురైంది. అటెండెన్స్ లేదనే పేరుతో దాదాపు 90 శాతం మంది విద్యార్థులను అనుమతించలేదు. ఎంసీజే ప్రథమ సంవత్సరంలో 40 మంది విద్యార్థులు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఇంటర్నల్స్ రాశారు. రెండో సంవత్సరంలో కొందరికి అనుమతి ఇచ్చినా, హెచ్‌ఓడీ తీరుకు నిరసనగా మిగిలిన విద్యార్థులు ఇంటర్నల్స్‌ను బాయ్‌కాట్ చేశారు. వర్కింగ్ పీపుల్స్ వర్కింగ్ జర్నలిస్టులు రోజూ క్లాసులకు హాజరు కాలేరని, వెసులుబాటు ఇవ్వాలని కోరారు. వి వాంట్ జస్టిస్.. అంటూ వర్సిటీ ఆవరణలో నినాదాలు చేశారు. ఎగ్జామ్ గది ఎదుట నిరసన తెలిపారు.



కొనసాగుతున్న నిర్మాణాలు

అక్రమ నిర్మాణాలను కూల్చివేసినా..

అధికార పార్టీ నేతల అండతో పనులు ప్రారంభం

పేట్‌బషీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేని నిర్మాణాలను అధికారులు కూల్చివేసినా.. మళ్లీ నిర్మాణలు కొనసాగుతున్నాయి. దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే 10 కమర్షియల్ దుకాణ సముదాయాలను నిర్మించారు. రెండు రోజుల క్రితం స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు కూల్చివేయిస్తుండగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు, అతడి అనుచరులు ఎక్స్‌కవేటర్ అద్దాలను ధ్వంసం చేసి, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. 24 గంటలు కాకముందే అధికార పార్టీ నేతల అండతో నిర్మాణ పనులను ప్రారంభించారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ వివరణ కోరదామని 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా స్పందించలేదు.

సైబర్ నేరాలపై 4.8 లక్షల మందికి అవగాహన

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ జాగరూకత దివస్‌ను గురువారం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం డీసీపీ బి. సాయిశ్రీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై 4.8 లక్షల మందికి అవగాహన కల్పించామని తెలిపారు. 41 విద్యాసంస్థలు, 18 పార్కులు, 5 రెసిడెన్షియల్ కమ్యూనిటీలు, 4 కార్పొరేట్ సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిచామని పేర్కొన్నారు. ఎఫ్‌ఎం రేడియోలోనూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించామన్నారు. మెట్రో రైల్ భాగస్వామ్యంతో ప్రయాణికులకు అవగాహన కల్పించామని డీసీపీ తెలిపారు.



తుదిమెరుగులు దిద్దుకుంటున్న హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్

హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్లు

డిసెంబరులో ప్రయాణికులకు అందుబాటులోకి

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న మరో రెండు రైల్వేస్టేషన్లను డిసెంబరులో ప్రారంభించేందుకు దక్షిణమధ్యరైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హైటెక్‌సిటీ, హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్లలో రూ. 55.16కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. హైటెక్‌సిటీ స్టేషన్‌లో రూ.25.95కోట్లతో చేపట్టిన రీడెవలప్‌మెంట్ పనులు 81శాతం పూర్తికాగా, హఫీజ్‌పేట్‌లో 84 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా స్టేషన్లలో ప్రధానంగా దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మిగిలిన పనులను నవంబరు చివరికల్లా పూర్తి చేసి డిసెంబరులో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

తెలుగు విశ్వవిద్యాలయం

సాహితీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో ఉత్తమ రచనలను ప్రోత్సహించడానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. 2024, 2025 సంవత్సరాలకు ప్రదానం చేసే పురస్కారాల ఎంపికకు పాఠకుల నుంచి సూచనలు, రచయితల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2021 జనవరి నుంచి 2024 డిసెంబరు మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన వాటిలో ఉత్తమంగా భావించిన రచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రచయిత మరణించినా వారి రచనలను సూచించవచ్చన్నారు. వచన కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 10 ప్రక్రియల్లో అన్ని ప్రక్రియలకు గాని, కొన్నింటికి గాని తమకు నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చన్నారు. సూచనలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణకర్త పేరు పేర్కొనాలి. రచయితలు కూడా తమ గ్రంథాలను సూచించవచ్చన్నారు. కవితా సంపుటి అయితే కనీసం 60 పేజీలు, మిగతా ప్రక్రియల్లో పుటల పరిమితిలేదు. రచయితలు తమ దరఖాస్తులను రిజిస్ట్రార్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి ప్రాంగణం, సాయినగర్ రోడ్, మేడ్చల్, మాల్కాజిగిరి, హైదరాబాద్- 500118, చిరునామాకు ఈనెల 25వ తేదీలోగా పంపించాలని రిజిస్ట్రార్ కోరారు.

వ్యభిచార గృహంపై దాడి

- ఇద్దరు ఉగాండా యువతులను కాపాడిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, నాచారం పోలీసులు దాడిచేసి ఇద్దరు ఉగాండా మహిళలను కాపాడారు. కస్టమర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డానియేల్ అనే వ్యక్తి నాచారం భవానీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉగాండాకు చెందిన ఇద్దరు యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. లొకాంటో యాప్ ద్వారా కస్టమర్‌లను సంప్రదించిన అతడు వారికి మహిళల ఫొటోలు పంపి, ఆన్‌లైన్‌లో పేమెంట్ తీసుకొని కస్టమర్లను భవానీనగర్‌లోని వ్యభిచార గృహానికి పంపేవాడు. సమాచారం అందుకున్న పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి కండోమ్‌లతోపాటు, డబ్బుఫోన్‌లను స్వాధీనం చేసుకుని, కస్టమర్ సంపత్‌కుమార్ మోహితేపై కేసు నమోదు చేశారు.డానియేల్ పరారీలో ఉన్నాడని తెలిపారు.

సొంత నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు

సరూర్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తన సొంత డబ్బుతో బాలాపూర్‌లోని పలు కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఇక్కడి 18వ డివిజన్ పరిధిలోకి వచ్చే దేవతలగుట్ట పరిసర కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువవడంతో స్థానికులు ఇటీవల ఈ సమస్యను మాజీ మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె తన సొంత ఖర్చుతో ఆయా కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. సదరు కెమెరాలను గురువారం బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు.

అప్పుడలా.. ఇప్పుడిలా!

- నాదర్‌గుల్ రోడ్డు కోసం నాడు పాదయాత్ర.. నేడు ఆ ఊసేలేదు
- ఎమ్మెల్యే సబితారెడ్డిపై బీజేపీ నేత అందెల ధ్వజం
- నాదర్‌గుల్-గాంధీనగర్ రోడ్డు బాగు చేయాలని ఆందోళన



గుంతలమయంగా మారిన నాదర్‌గుల్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న శ్రీరాములుయాదవ్ తదితరులు

సరూర్‌నగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పదవిలో లేనప్పుడు నాదర్‌గుల్ రోడ్డును బాగు చేయాలంటూ పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి.. నేడు పదవిలో ఉండి కూడా సదరు రోడ్డు అభివృద్ధిని గాలికొదిలేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ధ్వజమెత్తారు. కొన్నేళ్లుగా గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్న నాదర్‌గుల్-గాంధీనగర్ రోడ్డును వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1,2 అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆందోళన నిర్వహించారు. నాదర్‌గుల్ బస్టాండ్ నుంచి గాంధీనగర్ వరకు పాదయాత్ర చేసి గుంతలున్నచోట బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే సబితారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ, 2017లో సబితారెడ్డి ఎమ్మెల్యే పదవిలో లేనప్పుడు నాదర్‌గుల్ రోడ్డు గురించి పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికై బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి అధిష్ఠించినా నేటి వరకు ఈ రహదారి గురించి పట్టించుకోక పోవడం శోచనీయమని ఆయన విమర్శించారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని పిసల్‌బండ నుంచి బాలాపూర్ చౌరస్తా, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, ఆదిభట్ల మీదుగా ఔటర్ రింగురోడ్డు వరకు గల ఈ రేడియల్ రోడ్డును 150 అడుగులకు విస్తరించడానికిగాను 2009లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంపీగా ఉన్న జైపాల్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారని, నేటికీ రోడ్డు దుస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా తయారయిందని అందెల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న శ్రీధర్‌బాబు ఈ అంశంపై దృష్టి సారించి వెంటనే రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, కార్పొరేషన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దుమారం రేపిన మాటలు!

చేవెళ్లలో నాలుగు రోజుల క్రితం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బుధవారం బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి చేసిన 'పీకుడు' వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఏం పీకుతున్నాడు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రతిగా.. గురువారం నాదర్‌గుల్‌లో ఆందోళన నిర్వహించిన బీజేపీ నేత అందెల శ్రీరాములుయాదవ్ ఘాటుగా స్పందించారు. ఒక ఎంపీని ఉద్దేశించి కార్తీక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఇలా.. కార్తీక్ చేసిన ఆ వ్యాఖ్య గురువారం రాజకీయ దుమారానికి కారణమయింది.

రోడ్డుపై చెత్త వేయొద్దన్నందుకు దాడి

తీవ్రంగా గాయపడిన జీహెచ్ఎంసీ కార్మికులు ● మలక్‌పేట పీఎస్ ఎదుట పారిశుధ్య కార్మికుల నిరసన



గాయపడిన ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్, యాదయ్యలను పరామర్శిస్తున్న బీజేపీ ప్రధాన కార్యదర్శులు

చాదర్‌ఘాట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై చెత్త వేయవద్దని చెప్పిన జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని ముసారాంబాగ్ డివిజన్‌లో పనిచేసే పారిశుధ్య విభాగం ఎస్ఎఫ్ఏ, కామాటీలపై వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముస్లిం కార్మికులు గురువారం మూకుమ్మడిగా కర్రలతో, చేతికందిన వస్తువులతో దాడి చేశారు. ఈ ఘటనలో ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కామాటి యాదయ్య కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో చికిత్స చేయించారు. అడ్డువచ్చిన మహిళా స్వీపర్‌ను ముస్లిం కార్మికులు తోసివేయడంతో ఒంటిపై గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, మలక్‌పేట పోలీసుల వివరాల ప్రకారం.. జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగానికి చెందిన కామాటీ యాదయ్య ముసారాంబాగ్ చౌరస్తాలోని మజీద్ వెనుకనున్న లేన్‌లో ఓ ఇంటి వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగిస్తుండగా వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముస్లిం యువకులు మరింత చెత్తను తీసుకువచ్చి రోడ్డుపై పారపోస్తున్నారు. రోడ్డుపై చెత్త పారవేయొద్దంటూ యాదయ్య ఆ యువకులకు చెబుతుండగానే దాదాపు 15 మంది మూకుమ్మడి కర్రలతో దాడికి దిగారు. అక్కడే ఉన్న ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్ అడ్డురావడంతో అతనిపై కూడా దాడికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన మహిళా స్వీపర్ అంజమ్మను తోసేశారు. విషయం తెలియగానే జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని 30 మంది ఎస్ఎఫ్ఏలు, 150 మంది స్వీపర్లు మలక్‌పేట పీఎస్‌కు చేరుకున్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని దాడి కారకులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో నిరసన విరమించారు.

చర్యలు తీసుకోవాలి : బీజేపీ

జీహెచ్ఎంసీ కార్మికులపై దాడి చేసిన వెస్ట్ బెంగాల్ ముస్లిం యువకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు చేయించాలని డిమాండ్ చేశారు.

ఐదుగురిపై కేసు నమోదు

దాడికి పాల్పడిన ఐదుగురిని గుర్తించి అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మిగతా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.



నేలకొరిగిన వరిపంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పంటనష్టం బాధిత రైతులను ఆదుకోవాలి: సీపీఐ

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలో నష్టం వాటిల్లిన వరిపంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పంటనష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం పెద్ద మనస్సుతో ఆదుకోవాలన్నారు. అధికారులు ప్రతీ గ్రామంలో తిరిగి పంట నష్టాన్ని పరిశీలించాలన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

ఎల్బీనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు చదువుకోలేక రోడ్డునపడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ అన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ గురువారం సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా కాలయాపన కోసం కమిటీని ఏర్పాటు చేశారని విమర్శించారు.

లబ్ధిదారులకు త్వరలోనే డబుల్ బెడ్రూం ఇళ్లు

టీపీసీసీ ప్రధానకార్యదర్శి మధుయాష్కీ గౌడ్

మన్సూరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు త్వరలోనే డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించనున్నట్లు టీపీసీసీ ప్రధానకార్యదర్శి మధుయాష్కీగౌడ్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ ఎరుకలనాంచారమ్మ బస్తీ, వనస్థలిపురం రైతుబజార్ వద్ద డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు గురువారం ఇళ్ల కేటాయింపు విషయమై మధుయాష్కీని ఆయన నివాసంలో కలిశారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులుగా ఎంపిక చేసిన తమకు ఇళ్ల కేటాయింపు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ జిల్లా ఇన్ చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హౌజింగ్ విభాగ అధికారులతో మాట్లాడి త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ చేపడతామని వారికి హామీ ఇచ్చారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల్లో రక్తదాన కార్యక్రమం

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డా.ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్ ఈస్ట్‌జోన్ సెక్టార్‌లోని పలు కళాశాలల్లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసీఐఎల్, తార్నాక, నారాయణగూడ, డీడీకాలనీ, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌లలో సుమారు 450మంది రక్త దానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, 40 ఏళ్లుగా లక్షలాదిమంది విద్యార్థులను ఐఐటీయన్లు, డాక్టర్లుగా తీర్చిదిద్దే అవకాశం లభించడం తమ పూర్వ జన్మ సుకృతమన్నారు. విద్యార్థుల ఉన్నతికి, తల్లిదండ్రుల ఆశయ సాధనకు శ్రీచైతన్య విద్యాసంస్థల బాధ్యత ఎప్పటికీ ద్విగుణీకృతమవుతూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్, ఈస్ట్‌జోన్ ఏజీఎం గుత్తా విజయకుమార్, పలువురు డీన్లు, ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ బాధితుల్లో సీనియర్ సిటిజన్లే ఎక్కువ

రాచకొండ సైబర్ క్రైం డీసీపీ నాగలక్ష్మి

మన్సూరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలోనే సైబర్ నేరాల బారినపడిన వారిలో అత్యధికులు సీనియర్ సిటిజన్లేనని, వీటి పట్ల సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సైబర్ క్రైం డీసీపీ నాగలక్ష్మి సూచించారు. సైబర్ జాగ్రూక్త దివస్‌లో భాగంగా నాగోల్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నాగోల్ డివిజన్ కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ అసోసియేషన్ భవనంలో సీనియర్ సిటిజన్లకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. నాగోల్ ఇన్ స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైబర్ క్రైం డీసీపీ నాగలక్ష్మి హాజరై మాట్లాడారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో గత మూడు నెలల్లోనే 1200 సైబర్ మోసాల కేసులు నమోదయ్యాయన్నారు.

శివాలయంలో చోరీ

సంతోష్‌నగర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ చౌరస్తాలోని ప్రధాన కూడలిలో ఉన్న మందిర్‌మసీద్‌లోని అతి పురాతనమైన శివాలయంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి శివాలయంలో ఆలయ పూజారులు పూజలు చేసి అనంతరం రాత్రి తాళాలు వేసి వెళ్లిపోయారు. తెల్లవారుజామున గుర్తు తెలియని నలుగురు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆలయం గేటు గ్రిల్స్‌ను విరగ్గొట్టి హుండీలోని నగదు చోరీ చేశారు. ఉదయం పూజారులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీం బృందం ఆధారాలు సేకరించారు. హుండీలోని దాదాపు రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తపాలా కార్యాలయాల పనివేళల పొడిగింపు

చంపాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తపాలా కార్యాలయాల పనివేళలను పొడిగిస్తున్నట్లు హైదరాబాద్ ఆగ్నేయ (సౌత్) మండలం సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ జి.హైమావతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ప్రజలకు పోస్టల్ సేవలను మరింత చేరువలోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఉప్పల్, చార్మినార్ ప్రధాన తపాలా కార్యాలయాలతో పాటు వనస్థలిపురం, హైకోర్టు, హయత్ నగర్, శంషాబాద్, పీఅండ్‌టీ కాలనీ ల కార్యాలయాలలో ప్రథమంగా పనివేళలు పొడిగిస్తుండటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. వనస్థలిపురం కార్యాలయం 24గంటలు(24/7), చార్మినార్ రాత్రి 9గంటల వరకు, ఉప్పల్ సాయంత్రం 6గంటల వరకు, పీఅండ్‌టీ కాలనీ, హైకోర్టు కార్యాలయాలు సాయంత్రం 5గంటల వరకు, శంషాబాద్, హయత్ నగర్ కార్యాలయాలు సాయంత్రం 4:30 గంటల వరకు తెరిచి ఉంటాయని తెలిపారు. ఈ సమయాల్లో ప్రజలు స్పీడ్ పోస్టులు, పార్సిల్స్, మనీయార్డర్ సేవలను పొందవచ్చని తెలిపారు.

'వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు'

ఎల్‌బీనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం వసతి గృహాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ హోంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి హెల్త్ ప్రొఫైల్ కార్డు రూపొందించాలని, వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలలోని వసతి గృహాలలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, తదితర అంశాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.


ముందస్తు సర్వే ఫలితాలపై నిషేధం విధించాలి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై రాష్ట్ర ఎన్నికల అధికారికి సీనియర్ కాంగ్రెస్ నాయకుని వినతి

చాదర్‌ఘాట్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రసార మాధ్యమాల్లో, యూ ట్యూబ్ చానెల్స్‌లో ప్రసారమవుతున్న ముందస్తు సర్వే ఫలితాలపై నిషేధం విధించాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్.రాజేశ్వర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల 11వ తేదీన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగే వరకు ఓటర్లను ప్రభావితం చేసేలా కొన్ని పార్టీలకు చెందిన వ్యక్తులు తమ సొంత ప్రసార మాధ్యమాల్లో, యూట్యూబ్ చానల్స్‌లో సర్వే పేరుతో వన్ సైడ్ ఫలితాలను ప్రకటిస్తున్నారని, ఇలాంటి ప్రసారాలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని కోరారు. అందుకు కారకులపై ఎన్నికల ప్రవర్తన నియమాళి కింద కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ఫిర్యాదుపై రాష్ట్ర ఎన్నికల అధికారి స్పందించారు. ఓటర్లను ప్రభావితం చేసే ముందస్తు సర్వే ఫలితాలపై గ్రేటర్ కమిషనర్‌కు, డిస్ట్రిక్ ఎన్నికల అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

8, 9 తేదీల్లో జైహో మూడో జాతీయ సమ్మేళనం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విజయశంకరస్వామి తదితరులు

పంజాగుట్ట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశ్వమానవాళి హితాన్ని కాంక్షించే మహోన్నత విలువలు ప్రతీ మతంలో ఉన్నాయని జైహో జాతీ య అధ్యక్షుడు విజయశంకరస్వామి అన్నారు. మతోన్మాదుల విద్వేషపు, అసహనపు పెడధోరణులతో ఈ విలువలు మరుగునపడే ప్రమాదం ఉందని ఆయ న పేర్కొన్నారు. మతం వేరు మతోన్మాదం వేరని, మతవేదికల నుంచి అన్ని రకాల మతోన్మాదాలను తరిమికొట్టాలని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎల్బీనగర్ సూర్యోదయ కాలనీలో ఈనెల 8,9వ తేదీల్లో నిర్వహించనున్న జైహో మూడో జాతీయ సమ్మేళనం కరపత్రాన్ని ఆయన సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి ముస్తాఖ్ అహ్మద్ అభిలాష్, అచల యోగిని డేరంగుల నారాయణమ్మ, శివగీత పీఠాధిపతి సోమేశ్వరస్వామితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జైభారత్ జాతీ య కార్యదర్శి లోక్‌నాథ్, రజిని, న్యాయవాది రఘు కుమార్, సర్వోదయ ప్రసాద్, జైహో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాని డి.లక్ష్మేశ్వర్,జైభారత్ రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాని సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫీజు వితరణ

సైదాబాద్, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): సైదాబాద్ మండల పరిధిలో 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు బండ్లగూడ, చార్మినార్ మండల పరిధిలో కొన్ని పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు 800 మంది విద్యార్థులు నగర చారిటబుల్ సొసైటీ పరీక్ష రుసుం చెల్లించింది. చెక్కులను గురువారం మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రావు, సంయుక్త కార్యదర్శి అనురాధ రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.